ఆధ్యాత్మిక అంతర్జాల పత్రిక

# శ్రీసన్నిధానం

సంపుటి 02 సంచిక 05 వే 2023



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో


3. సంపాదకీయం
4. నెలవారి పంచాంగం
5. మన దేవాలయాలు
6. రామానుజ సుధామాధురి
7. శ్రీనమ్మాళ్వార్ నామవైభవము
8. నృసింహ జయంతి ప్రత్యేకము
9. శ్రీపతిస్తుతి
11. భాగవతంలో భగవంతుని కథలు
12. పుష్పయాగము
13. జ్యోతిర్విజ్ఞానమ్
16. ఆధ్యాత్మిక వార్తలు



**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్
సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్
డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య
శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహా చార్యులు




## ముఖచిత్ర పరిచయం

భూషణవికాస శ్రీధర్మపురనివాస దుష్టసంహార నరసింహ దురితదూర అనే మకుటంతో శేషప్పకవి అందించిన నృసింహాశతకం ద్వారా నృసింహతత్వము జనం నోటి వెంట నేటికీ జాలువారుతున్నది. నామ జపంతోనే ఎలాంటి ఆపద నుంచి అయినా గట్టెంక్కించే స్వామి. కేవలం పానకం, కొబ్బెరి బెల్లాలతో సంతృప్తిపడి భక్తుల కోరికలీడేర్చే స్వామి కొండెక్కి కూర్చుని విహంగ వీక్షణంలా అందరినీ గమనిస్తుంటాడని ప్రగాఢ నమ్మకం. కేవలం తెలంగాణాలోనే 176 పైగా నృసింహ క్షేత్రాలు ఉన్నాయి. అతిప్రాచీనమైనవి ప్రశస్తమైనవీ. దేశవిదేశాలలో ఉన్నాయి. ఇలా వెలిసిన ప్రతి నరసింహ స్వామికీ ఒక ప్రత్యేకత, గుట్టలపై, నీటిలో, హిమవత్ పర్వత ప్రాంతంలో మంచుకొండలపై, మెల్కోటలో, తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ప్రదక్షణ మార్గంలో అభయం ఇచ్చే యోగ నారసింహుడు, పానకాలస్వామి, అహోబల నవనార సింహుడు, మనిషిలాంటి శరీరంతో మల్లూరు నర్సింహుడు, యాదాద్రి నారసింహుడు. తమిళనాట దివ్యదేశ క్షేత్రాలలో శ్రీనృసింహ, శ్రీసుదర్శన రూపాల్లో దర్శనం ఇస్తున్నాడు. ఇందుగలడందులేడన్నట్లు ప్రతిచోటా నరసింహ స్వామి ఆలయం ఉంది. ఒకమారు ఆర్తిగా ప్రహ్లాద వరద గోవిందా అంటే మనం చేసిన పాపాలన్నీ కరుణించి హరిస్తాడు. స్వామి మంత్రమూర్తి. వేదాంతాలుగా భాసిల్లే ఉపనిషత్తులలో నరసింహ తత్వం వర్ణించబడి వుంది. స్వామి దివ్య మంగళ స్వరూపాన్ని తన కుంచె నుంచి సజీవ చిత్రంగా ఆవిష్కరించారు శ్రీమాన్ డింగరి సంపత్ కుమారాచార్య.


PUBLISHED BY : డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్



చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 878 2253323 ; 9502583323;



నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# సంపాదకీయం

## జ్ఞానమార్గానికి సోపానాలు మన వాఙ్మయాలు



సంస్కృతి సంప్రదాయాలకు పట్టుకొమ్మలు మన వాఙ్మయాలు. జీవన రహస్యసారాలు పురాణాలలో దాగి ఉన్నాయి. పూర్వకాల కథా విశేషం అన్న అర్థం పరమార్థం “పురాణ” అనే పదంలో ఇమిడి ఉంది. పురాణాలలో ఎన్నో సంగతులు ఉన్నా వాటిని విడమరచి మనలో జ్ఞాన వెలుగులు నిండే అవకాశాలు తక్కువే. మనకు అన్నీ తెలుసు అనుకుంటాం. నేడు ఇది కొత్తసంగతి అని చెప్పింది ఎప్పుడో ఒకప్పుడు చెప్పుకున్నదే సుమా! అని మన వాఙ్మయాలు గుర్తు చేస్తున్నాయి. వీటి అధ్యయనం మన పాఠశాలలో కానీ, పాఠ్యప్రణాళికలలో కానీ కనిపించదు. భారతీయ విజ్ఞానం అందించే అంశాలు నేటి ఆధునిక విద్యలో అన్నీ కనుమరుగు అవుతున్నాయి. పోనీ... ఇప్పుడు చదువుకున్న చదువులు ఉపాధికి పనికి వస్తున్నాయా? అంటే అదీ లేదు. మనం మనిషిగా బ్రతకడానికి మార్గాన్ని కూడా సూచించడంలేదు. అయితే నడుస్తున్న విద్యావిధానాన్ని మార్చలేము. దాని వల్ల కూడా కొంత ప్రయోజనం ఉందన్న వాదన లేకపోలేదు, ఈ విషయాన్ని పక్కనపెడితే, ఆధునికవిద్యలో ప్రాచీన వాఙ్మయంలోని అంశాలను ప్రస్తావించాల్సి వుంది. ప్రాచీన వాఙ్మయంలోని అంశాలను అప్పుడప్పుడూ చర్చావేదికల ద్వారా కానీ, సమాజహిత ప్రవచనాల ద్వారాకానీ వాటిలో దాగిఉన్న రహస్యాలను వెల్లడించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తద్వారా విజ్ఞానపు వెలుగులు నేటి సమాజంపై ప్రసరించేలాచేయటం తక్షణ కర్తవ్యం! ఆ కర్తవ్యానికి బద్ధులమై నేడు చైతన్య శంఖారావం పూరించడానికి ఆలోచించగల వారందరూ సిద్ధంకావాల్సిన అవసరం ఉంది. ఇది మానజీవనవిధానాన్ని భారతీయ సంస్కృతీ సారాన్ని భావితరాలకు అందిస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

ఆలోచిస్తే... ఎన్నో సందేశాలకు సమాధానాలు లభ్యం అవుతాయి. ఆలోచించే అవసరాన్ని దూరంచేసే సాధనాలు మనకు అందుబాటులోకి వచ్చాయి. పేరు, పదం మరేదైనా విషయాన్ని తెలుసుకోవాలంటే మొబైల్లో గూగుల్ అంటూ శోధించడం అలవాటైపోయింది. దీనితో ఆలోచనకు, జ్ఞాపకశక్తి కాస్త తగ్గుతుంది. అగ్గిపుల్లా, సబ్బుబిళ్ల కాదేది కవిత కనర్హం అని శ్రీశ్రీ చెప్పినట్లు, అన్ని అవకాశాలను వినియోగించుకోవాలి. ఆధునిక సాధనాలను ఉపయోగించడం యువత నేర్చుకోవాలి. ప్రాచీన వాఙ్మయ పుటలను తిరగవేసేలా ఆలోచనా శక్తిని పెంచుకోవాలి. వాస్తవం ఇది అంటూ తెలియ జెప్పాలి. హిందుత్వం ఒక మతం కాదు. ఇది ఒక సనాతన ధర్మం. హిందు ధర్మం అంటే జ్ఞాన మార్గము. మంచి మార్గంలో నడిపించే జీవన విధానం అని తెలియజెప్పేలా అధ్యయనం జరుగాలి. వ్యాస మహర్షి 18 (అష్టాదశ) పురాణాలు రచించాడు. ఒక్కో పురాణంలో ఎన్నో రహస్యాలు దాగి ఉన్నాయి. వీటి మూలాలన్నీ సంస్కృతంలో ఉన్నాయి. వాటిని సామాన్యులకు అర్థం అయ్యే శైలిలో అందించే ప్రయత్నం చేయాలి. అందులోని రహస్యాలను విడమరచి చెప్పేప్రయత్నం చేస్తే కానీ వాటి రసాస్వాదన చేయాలన్న ఆలోచన కలిగి విజ్ఞాన వాసనలు ఒంటబడుతాయి. దీనితో ధర్మశాస్త్రం గురించి కూడా తెలుస్తుంది. వేదాలు, ఇతిహాసాలు, పురాణాలు ఇత్యాదులపై పఠనాసక్తి కలుగుతుంది. మనకు కావాల్సిన తెలుసుకోవాల్సిన తెలియజెప్పాల్సిన విషయాలు ఈ అధ్యయనం వల్ల తెలుస్తాయి. “పురాణాలు చదవండి! ధర్మశాస్త్రం గురించి తెలుసుకోండి!!. ఇలా నిత్యం చదివేవారిని నేను ప్రోత్సహిస్తానని” ఎన్నో మార్లు తమ ధార్మిక ప్రవచనాలలో మహామహోపాధ్యాయ శ్రీ ఉ.వే. శ్రీమాన్ సముద్రాల వేంకటరంగరామానుజాచార్య స్వామి వారు ఉద్బోధిస్తూనే ఉన్నారు. ప్రోత్సహించడానికి శ్రీసన్నిధానం సిద్ధంగా ఉంది. ఆచరణయోగ్యంగా పత్రికశీర్షికలకు పదును పెడుతోంది. పరమభాగవతోత్తముల భావజాలాన్ని భక్తి వాసనలతో పాఠకుల వద్దకు చేరవేస్తోంది. ప్రతిఅక్షరం అమూల్యం! రహస్యసారం!. అందరూ ఆస్వాదించండి.

-వొద్దిపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్ మే

తెలుగు పంచంగం

వైశాఖ మాసం 21-04-2023 శుక్ల పక్షం తో ప్రారంభమై 19-05-2023 వరకు. తదుపరి జ్యేష్ఠ మాసం.

10-05-2023 వరకు భరణి కార్తి, 11-5-2023 నుండి 24-05-2023 కృతిక కార్తి, 25-05-2023 నుండి రోహిణి కార్తి.

**పండుగలు :** 01-05-2023 సర్వేషాం ధనద్రై ఏకాదశి , జగిత్యాల శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం, 02-05-2023 శ్రీపరుశరామ ద్వాదశి, 04-05-2023 శ్రీ నృసింహ జయంతి, దోలు కర్తరీ ప్రారంభం, 05-05-2023 బుద్ధ పూర్ణిమ, వ్యాస పూర్ణిమ, అన్నమాచార్య జయంతి, 08-05-2023 సంకష్టహరచతుర్థి, 11-05-2023 వాస్తు కర్తరీ ప్రారంభం, కృతిక కార్తీ, 14-05-2023 శ్రీ హనుమజ్జయంతి, 15-05-2023 వృషభ సంక్రమణం, 18-05-2023 మాస శివ రాత్రి, 19-05-2023 అమావాస్య, శని జయంతి 31-05-2023 సర్వేషాం త్రివిక్రమైకాదశి, శ్రీ కూర్మ జయంతి.

## మాస ఫలాలు

**మేషం:** ఈ నెల అనుకూలంగా ఉండదు. ఆరోగ్య, నేత్ర, శిరోపీడలు, ప్రతీ విషయంలో జాగ్రత్త అవసరం. ఆర్థికలావాదేవీలు సంతృప్తిగా ఉంటాయి. చేయువృత్తి వ్యాపారాలు అనుకూలంగా ఉండవు.

**వృషభం:** ఈ నెల అనుకూలంగా ఉండదు. చేయు వృత్తివ్యాపారాలు లాభించవు. ఋణములు చేయ వలసివచ్చును. వాహన రిపేర్లు, గృహంలో ఆందోళనలు, మనఃశ్శాంతి ఉండదు.

**మిథునం:** ఈ నెల అనుకూలము. ఆదాయంనకు లోటుండదు. వ్యాపారాలు బాగా జరుగును. ఉద్యోగులకు ప్రమోషన్స్, ప్రయాణాలు కలిసివచ్చును. వాహనసౌఖ్యం.

**కర్కాటకం:** ఈనెల మిశ్రమ ఫలితాలుంటాయి. ఆరోగ్యం అనుకూలం ఉంటుంది. వ్యాపారపరంగా బాగుండి ఆదాయంనకు లోటుండదు. సమస్యలను చాకచక్యంతో ఎదుర్కొంటారు.

**సింహం:** ఈనెలలో గ్రహసంచారం బాగుంది. అన్నింటాజయం. వ్యాపారలావా దేవీలు బాగా జరుగును. శుభకార్యాలకు హాజరగుదురు. బంధుమిత్ర సంతోషములు, శతృజయం, నూతనవస్తు, వాహనసౌఖ్యం.

**కన్య:** ఈ నెలయందు అనుకూలంగా ఉండదు. పనులన్ని నిలచిపోవును. ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటారు. మానసికంగా ఇబ్బందులు.

**తుల :** ఈ నెలయందు వ్యాపారవర్గం వారికి మంచి వ్యాపారం జరుగును. ఉద్యోగస్థులకు అనుకూలత ఉండదు. దూరప్రయాణాలు చేయుదురు. ఆరోగ్యం కొంత కుదుటపడును. వ్యవహారాలు అనుకూలించును.

**వృశ్చికం:** ఈనెలలో అన్నివిధాలుగా చాలా బాగుంటుంది. ఆర్థికంగా, ఆనందంగా కుటుంబ పరంగా బాగుంటుంది. సమస్యలు మబ్బు విడినట్లు విడి పోవును. బంధుమిత్రుల సహాయ సహకారములు లభించును. గృహ నిర్మాణములు ప్రారంభిస్తారు.

**ధనుస్సు:** ఈనెల అన్నివిధాలుగా బాగుండును. ఆర్థికంగా అనుకూలం వ్యాపారులకు మంచి వ్యాపారం జరుగును. ఉద్యోగులకు ప్రమోషన్స్ వచ్చును. జీవనం ఆనందంగా ఉంటుంది.

**మకరం:** అన్నివిధాలుగా బాగుంటుంది. ధనలాభం, ఆరోగ్యం బాగుంటుంది. సంతోషవార్తలు వింటారు. శత్రువులే మిత్రులగుదురు. సంఘంలో మీ పరపతి పెరుగును.

**కుంభం:** ఈనెలలో అనుకూల గ్రహసంచారంవల్ల అన్నిరంగాలవార్కి బాగుండును. ఆదాయంనకు లోటుండదు. ఆరోగ్యం బాగుంటుంది. ధైర్యంగా ముందుకుపోగలరు.

**మీనం:** ఈ నెల అన్నివిధాలుగా బాగుండును. ఆర్థిక సమస్యలుండవు. ధైర్యంగా ముందుకు పోగలరు. ఆరోగ్యం బాగుండును.

వివాహానంతరము కర్ణవేధ, ఉపనయనము, ఉద్యాపనలు, తీర్థయాత్రలు, పుట్టు వెంట్రుకలు, గంగాస్నానము, క్షౌరం, గయాశ్రాద్ధం, పిండ ప్రధానములు, ఆరు నెలలలోగా మళ్ళీ వివాహాది శుభకార్యములు చేయకూడదు.

హేమాచలక్షేత్రం

మన దేవాలయాలు

# మృదువైన శరీరంగల శ్రీ నృసింహస్వామి





నృసింహ స్వామి స్వయంభువుగా వెలిసిన హేమాచల క్షేత్రం. ఇది మల్లూరు గ్రామం మంగపేట మండలం లో ఉంది. సుమారుగా నాలుగవ శతాబ్ద కాలంలో ఈ ప్రదేశాన్ని దిలీపకర్ణి అనే మహారాజు పరిపాలన చేసేవాడు. ఆ మహారాజుకి స్వామి స్వప్నంలో కనబడి నన్ను బహిర్గతం చేయండి అని కొన్ని గుర్తులు తెలుపారు. రాజు సైన్యంతో వచ్చి కొండనంతా తొలుస్తూ స్వామివారిని వెలికి తీసాడు అలా తొలుస్తున్న క్రమంలో స్వామి వారికి నాభిలో గునపం పోటు తగలింది. దానితో ఆ నాభి నుండి ద్రవంలాగా వస్తూవుంటుంది. దానికి కారణం స్వామివారి శరీర విశిష్టత. స్వామి మానవ శరీరంతో సింహం తలతో ఉంటాడు. అంటే మానవశరీరం వలె సున్నితమైన శరీరం కలిగి ఉంటాడు. ఆ ద్రవానికి పసుపు చందనం కలిపిన మిశ్రమాన్ని పెడతారు. ఆ ద్రవం తో కలిసిన ప్రసాదాన్ని స్వామి ప్రసాదంగా భక్తులకు ఇవ్వడం జరుగుతుంది. అది కూడా ప్రత్యేకంగా సంతానం లేని వారికి, అనారోగ్యంతో బాధపడేవారికి, వివాహ సమస్య కలవారికి ఈ ప్రసాదం ఇస్తారు. గ్రహ దోషాలకి, నక్షత్ర దోషాలకి, గ్రహణాలలో జన్మించిన వారికి కూడా ఆ ప్రసాదం ఇస్తారు. అది స్వీకరించటానికి పూజా విధానము వుంటుంది. ఎవరైతే ప్రసాదం కోసం అక్కడి ఆలయానికి వచ్చి ఉంటారో వాళ్ళనే కూర్చోబెట్టి వాళ్ల గోత్ర నామాలతో సంకల్పం చేసి స్వామివారి సాలగ్రామ తీర్థంతో శు ద్ధి చేసిన తర్వాత మూల మంత్రం చెబుతూ మంత్రోపదేశంతో ఆ ప్రసాదాన్ని ముందుగా కొంత భాగం తీర్థంతో పాటు ఇస్తారు. ఆ తర్వాత కొంత ప్రసాదాన్ని ఇంటికి ఇచ్చి అది వాడాల్సిన పద్ధతులు విధానాలు చెప్పడం జరుగుతుంది. ఇక్కడ ప్రతి శని ఆదివారాల్లో 10:30 నుండి 12 గంటల మధ్య స్వామివారికి నువ్వుల నూనెతో అభిషేకం చేస్తారు. తిల తైలాభిషేకం అంటారు. కేవలం శనీశ్వరుడికి మాత్రమే దోష పరిహారార్ధంగా తైలంతో అభిషేకం చేస్తారు. కానీ ఏ ఆలయంలో జరగనటువంటి విశిష్ట తైలాభిషేకం ఈ వైష్ణవ క్షేత్రం లో ప్రత్యేకంగా జరుగుతుంది. కేవలం శనిదోషం ఒకటే కాకుండా భక్తులకు ఉన్నటువంటి అన్ని రకాల దోషాలు, బాధలు, పీడలు, సమస్యలు తొలగి పోతాయి. అభిషేక సమయంలో అలంకారం లేకుండా స్వామివారు తన నిజ రూపంలో దర్శనమిస్తారు. ఆ సమయంలో ఆయన శరీరం సుతి మెత్తగా వుండడం, ఆయనకు దెబ్బ తగిలినటువంటి ఆ నాభిని చూపించడం జరుగుతుంది. ఇక్కడ స్వామివారు తన నిజరూపంలో అంటే ఉగ్రనరసింహుడుగా, శంఖ చక్ర గదా పద్మములు చేతబూని చతుర్భుజుడుగా ఉంటాడు. ఎక్కడైనా సరే మనకు లక్ష్మీనరసింహుడు కనబడే రూపంలో అమ్మవారిని తొడ పైన కూర్చోబెట్టుకొని స్వామివారు కూడా కూర్చుని శిలారూపంలో కనపడతారు. కానీ ఇక్కడ అమ్మవారు లేకుండా తన నిజ రూపంలో ఉండటం విశేషం. అందుకే ఆయన కోపాన్ని, ఉగ్రత్వాన్ని తగ్గించడం కోసం ఆయనను శాంతింప చేయడానికి కోసం లక్ష్మీదేవిని స్వామి వారి హృదయంలో మంత్ర ప్రతిష్ఠ చేశారు.



ప్రధాన అర్చకులు రాఘవాచార్యులు



స్వామి వారి వయస్సు సుమారుగా 4776 సంవత్సరాలు అని చెప్తారు. ఈ క్షేత్రం హేమాచల క్షేత్రం. ఇక్కడ స్వామివారి పాదాల కింద నుండి నీళ్ళు వస్తుంటాయి. కింద ఆ ప్రదేశాన్ని చింతామణి అంటారు. చింతామణి అనేది రుద్రమదేవి పరిపాలన కాలంలో ఆవిడ ఈ ప్రదేశానికి వచ్చినప్పుడు నామకరణం చేసిందట. ఆ నీటికున్న ప్రత్యేకత ఏమిటంటే స్వామి వారి పాదాల కింద మొదలై అడవి ప్రాంతంలో ఆకులు వేర్లు, చెట్లు, మూలికలు అలా కలుపుకుంటూ ప్రవహిస్తుంది. ఆ కారణంగా నీటికి చెడిపోకుండా నిల్వ ఉండే ఔషధ గుణం ఉంది. పచ్చని ప్రకృతి మధ్య దట్టమైన అటవీప్రాంతంలో., మృదువైన శరీరంతో, గొప్ప మహత్యంతో కొలువయిన స్వామిని ఎంతో ఆశ్చర్యంతో భక్తితో ఎందరో దర్శించు కుంటారు.

# ఆనందము మోక్షకందము రామానుజార్య సంబంధము

## - శ్రీమతి సముద్రాల శారద

భగవంతుని పంచావతారాల్లో చేతనునికి ప్రత్యక్ష సంబంధం కలిగిన స్వరూపము అర్చావతారమే! వేద శబ్దోచ్ఛారణచే ఆగమాది దివ్య శాస్త్రవిహిత ఆచరణల చేత సంపద్యతను పొందిన దివ్యస్థానము. శాస్త్రము అంటే సర్వకాల సర్వావస్థల యందు, సమస్త ప్రదేశములందు, సర్వహితమైన ఆచరణా విధివిధానాలను తెలిపేదే శాస్త్రం. ప్రమాణ పూర్వకము, హేతుబద్ధము అయిందే శాస్త్రము. శ్రీపాంచరాత్రాగమాన్ని, శ్రీమద్భగవద్గీతను గొప్ప శాస్త్రాలుగా పెద్దలు అభివర్ణించారు. శాస్త్రాలు అంటే వేద వేదాంగ సారభూతాలే అని పెద్దల మాట! అటువంటి శాస్త్రసారంగా సముద్భవించినదే రామానుజ మార్గం. అది ఆనందదాయకము మోక్షప్రదము కూడా!



భగవత్ స్వరూపమైన అర్చామూర్తులకు మూలము శ్రీ రంగనాథ స్వామి. అలాగే దివ్యదేశ మూలకందాలుగా కోయిల్ (శ్రీరంగము), తిరుమల్తై, పెరుమాళ్ కోయిల్ (శ్రీ కంచి), తిరునారాయణ పురం నాలుగు దివ్య దేశాలను పేర్కొంటారు. ఈ క్షేత్రాలు శ్రీరామానుజాచార్యుల జీవితంలో కూడా మూలకందాలైన త్యాగ (శ్రీ కంచి), భోగ (శ్రీరంగం), పుష్ప (తిరుమల), జ్ఞాన (తిరునారాయణపురం) మండపాలుగా ప్రసిద్ధి చెందాయి.

అన్ని దివ్యదేశ పెరుమాళ్ళు రాత్రివేళ శ్రీరంగాన్ని చేరుకుంటారని, అర్చా స్వరూపంలో ఉన్న భగవంతునికి బీజము శ్రీ రంగనాథ పెరుమాళ్లే అని మన ఆళ్వార్లు స్తుతిస్తారు. భగవదవతార వైభవాన్ని చేతనునికి భగవంతునికి గల సంబంధాన్ని భగవద్ ఆరాధన చేసే విధివిధానాలను తెలియజేసేది శ్రీ పాంచరాత్రాగమం. సాక్షాద్భగవంతుని వాక్కుగా తెలుపబడేది గీతా శాస్త్రము. ఇవి వేద ప్రామాణికంగా విశిష్టాద్వైత తత్వ ప్రాధాన్యంగా రామానుజ మార్గంలో నిరూపించబడ్డాయి. మోక్షదాయకముగా శ్రీ భగవద్రామానుజ శ్రీ సూక్తులు మార్గదర్శనంగావిస్తాయి.

ద్రావిడ వేద సారముగా సంపన్నవంతమైన శ్రీరామానుజ మార్గము జీవనానందాన్ని కలిగిస్తూ మోక్షకందమైనదై వ్యాపించినది. "ఏకవిజ్ఞానేన సర్వజ్ఞానం" అని పరమాత్మ తత్వాన్ని నిరూపించి భగవత్ కల్యాణ గుణానుభవాన్ని ఆనందదాయకంగా వివరించిన గొప్ప సాంప్రదాయాన్ని జగదాచార్యులు మనకు ప్రసాదించారు.

అందుకే శ్రీ రామానుజార్య సంబంధము జీవనానంద దాయకము మోక్షమార్గ ప్రేరకము అని పెద్దలచే కీర్తించబడుచున్నది. విశాల భావం, విస్తృత లక్ష్యం కలిగినదని నిరూపించబడినది. యతి రాజుల జీవన గమనంలో ఎన్నో సన్నివేశాలు మనను ఆశ్చర్యానికి గురిచేస్తాయి.

చోళరాజు దారుణ దుశ్చర్యలకు పూనుకొని శ్రీ రామానుజ మార్గానికి జగదాచార్యులకు కీడు తల పెట్టాడు. చోళరాజు దుర్మార్గము వలన శ్రీవైష్ణవశ్రీ సంపద్యతకు భంగం కలగరాదని వారు శిష్యులతో కలిసి మేల్కోట వైపు అడవి మార్గంగా బయలుదేరారు. రాజభటుల దృష్టికి చిక్కకుండా కాషాయ త్రిదండాదులను భావనలో ధరించి భౌతికంగా సాధారణ వస్త్రధారణతో ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో ఎందరో శిష్యులను అనుగ్రహించారు. తిరునారాయణ పురానికి చేరుకొని అక్కడ ఎంతో మందిని పరివర్తన గావించారు

తిరిగి చాలా కాలం తర్వాత క్రిమికంఠుడు నశించి, పరిస్థితులు చక్కబడ్డాయని తెలుసుకుని శ్రీరంగానికి చేరుకున్నారు. శ్రీరంగనాథ కైంకర్య దర్శనాలకు దూరంగా ఉండలేని ప్రేమాతిశయంగల పరమాచార్యులు పెరియ పెరుమాళ్ళ విరహంతో తపించి పోయారు. ఆ శ్రీరంగనాథుని సన్నిధికి చేరిన క్షణాలు! వారి చరిత్రలో ఉద్వేగపూరితాలు! సుదీర్ఘ కాలం తర్వాత ప్రాణ సమానమైన శ్రీరంగనాథుని ప్రియ శిష్యులైన శ్రీ కురేశు లను చూసిన క్షణాలు అశ్రుపూరిత నయనాలతో వారి హృదయం ఆర్ద్రతను పొందింది. ఆచార్య నిష్ఠతో యతిరాజులకు బదులుగా చోళరాజు ఆస్థానానికి తాను వెళ్లి (మిగతా 10 వ పేజీలో)



# శ్రీ నమ్మాళ్వార్ల నామవైభవము



శ్రీమతి టి.కె. చూడామణి

శ్లో: ఋషిం జుషామహే కృష్ణతృష్ణా తత్వ మివోదితమ్।
సహస్రశాఖాం యో2 ద్రాక్షీత్ ద్రావిడం బ్రహ్మ సంహితామ్॥

శ్రియః పతి, ఆవాప్త సమస్త కాముడు శ్రీమన్నారాయణుడు. ఈ సంసార చక్రంలో పరిభ్రమించే జీవుని స్థితిని చూచి జాలి పడి ఎలాగైనా ఉద్ధరించాలని శాస్త్రాన్ని అనుగ్రహించాడు. తానే రామ కృష్ణాది అవతారములు ధరించాడు. అయినా ఈ చేతనుడు. స్వామి మహిమ తెలిసికొనలేకపోయాడు. ఇంక నిత్యసూరులనే భూమికి పంపి చేతనోజ్జీవనం చేయాలని సంకల్పించాడు స్వామి.

భగవంతుని సంకల్పబలంతో చేతనులనుద్ధరించడానికి ఈ భూమిపై అవతరించిన వారే ఆళ్వార్లు. ఆళ్వార్ అంటే ఆనంద ప్రవాహంలో, భగవదనుభవంలో మునిగి తేలేవారు అని అర్థం.

కలౌఖలు భవిష్యన్తి నారాయణ పరాయణాః
క్వచిత్ క్వచిత్ మహాభాగాః ద్రావిడేషు చ భూరిశః అన్నట్లు తామ్రపర్ణి నదీ తీరంలో అవతరించిన మహనీయులే నమ్మాళ్వార్లు.

ఆళ్వార్లు 10 మందిగా ప్రసిద్ధి చెందారు. వారు 1.పొయ్‌గై ఆళ్వార్, 2.పూదత్తాళ్వార్ 3.పేయాళ్వార్ 4.తిరు మఴిశై ఆళ్వార్ 5.నమ్మాళ్వార్, 6.కులశేఖరాళ్వార్, 7.పేయాళ్వార్, 8.తొండరడిప్పొడి ఆళ్వార్, 9.తిరుప్పాణ్ ఆళ్వార్, 10.తిరుమంగై ఆళ్వార్. శ్రీ నమ్మాళ్వార్ శిష్యపరమాణువుగా మధురకవి ఆళ్వార్లు పెరియాళ్వార్ల్ పుత్రికగా శ్రీ ఆండాళ్ తల్లి. వీరిరువురను కూడ చేర్చి 12 మంది ఆళ్వార్లుగా శ్రీవైష్ణవ సంప్రదాయం సిద్ధాంతీకరించింది.

ఆళ్వార్లలో నమ్మాళ్వార్లను 'అవయవి' అని ముఖ్యులుగా భావించారు. 'అంగి' గా అభివర్ణించారు. ఎలాగంటే నమ్మాళ్వార్లకు పూదత్తాళ్వార్లు – శిరస్సు, పొయ్‌గైళ్వార్లు, యాళ్వారు – నేత్రాలు, పెరియాళ్వార్లు – తిరుముఖమండలం, తిరుమఴిశై ఆళ్వార్లు – కంఠం, కులశేఖరాళ్వార్లు, తిరుప్పాణ్ ఆళ్వార్లు – హస్తాలు, తొండరడిప్పొడి ఆళ్వార్లు – వక్షః స్థలం, తిరుమంగై ఆళ్వార్లు – నాభి, మధురకవులు శ్రీచరణాలు. వీరందరితో కూడిన దివ్య స్వరూపమే శ్రీ నమ్మళ్వారుల దివ్య మంగళ విగ్రహం. నమ్మాళ్వార్లు కలియుగ ప్రారంభం 43వ రోజు తామ్రపర్ణీ నదీ తీరంలో ఉన్న తిరుక్కురుగూర్ – కురుకాపురిలో అవతరించారు. పుట్టినది మొదలు సామాన్య శిశు చేష్టలు లేవు. వైశాఖ శుద్ధ చతుర్దశీ శుక్రవారం, విశాఖా నక్షత్రయుక్త, కర్కాటక లగ్నంలో అవతరించిన వీరు భగవధ్యానమూర్తిగా నిలిచారు. తల్లిదండ్రులు వీరిని పోలిందు నిన్రపిరాన్ అనే పెరుమాళ్ళ సన్నిధికి తీసికొని వెళ్ళారు. అక్కడ ఒక నిద్రనెరుగని చింత చెట్టు (నిర్నిద్రతింత్రిణి) ఉంది. నమ్మాళ్వార్లు ఆ ఆలయం చేరగానే కళ్ళు విప్పి పెరుమాళ్ళను సేవించారు. ఆ చింతచెట్టు తొఱ్ఱలో యోగనిష్ఠలో కూర్చున్నారు. భగవద్దర్శనముచే కళ్ళువిప్పి చూచారు. కాబట్టి మార్పు రావడం వలన మారన్ అని పేరుపొందారు. మారడు అంటే మన్మథుడు. అంత అందగాడు కాబట్టి మారన్ అని పేరు వచ్చిందని కూడా అంటారు. వీరి యోగనిష్ఠకు శ్రీమన్నారాయణుడు పరవశించి, ఆయా దివ్య దేశాల నుండి కదలివచ్చి ఆళ్వార్లకు ప్రత్యక్షమయ్యాడు. ఆనంద పరవశులైన ఆళ్వార్లు ఆయా పెరుమాళ్ళకు మంగళాశాసనం చేశారు. పరమభక్తితో నమ్మాళ్వార్లు నాలుగు దివ్యప్రబంధాలను అనుగ్రహించారు. అవి 1. తిరువిరుత్తము, 2. తిరువాశిరియము, 3.పెరియతిరువందాది, 4. తిరువాయిమొఴి వీటిలో

1. తిరువిరుత్తము – ఋక్ వేదసారము 100 పాశురములు,
2. తిరువాశిరియము – యజుర్వేదసారము 07 పాశురములు,
3 పెరియి తిరువన్దాది – అధర్వవేదసారము 87 పాశురములు,
4 తిరువాయ్ మొఴి – సామవేద సారము 1102 పాశురములు

శిశువు భూమి మీద పడగానే శఠ అనే వ్రాయవు కప్పివేసి అజ్ఞానాన్ని కలిగిస్తుంది. ఆ వాయువు దగ్గరకు వస్తూండగా హూంకరించి తరిమి కొట్టారు. కాబట్టి వీటికి శఠగోపులు అనే దివ్యనామం వచ్చింది.

వీరి మెడలో పొగడ పూలమాల, వకుళమాల పరమాత్మ అనుగ్రహించాడు కాబట్టి వకుళాభరణులు అనే పేరు వచ్చింది. కారిమార్ కుమారులు కాబట్టి కారి మారన్ అని అన్నారు. కురుకాపురిలో అవతరించారు కాబట్టి కురుకాధీశులు అయ్యారు. పెరుమాళ్ళు,పెద్దలు. అంతా మన ఆళ్వార్లు అని ఆదరంతో పిలువడం వలన "నమ్మాళ్వార్" అనే పేరు ప్రసిద్ధంగా నిలిచింది. ★



# "అత్యద్భుతరూపముద్వహన్"

**శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి స్థానాచార్యులు**

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం**

## "నరసింహ జయంతి" ప్రత్యేకం

ఆశ్చర్యకరమైన ఈ సృష్టి ఎలా ఏర్పడింది? ఈ సృష్టికి కారణభూతుడు ఎవరు? సృష్టిని నడిపిస్తున్న వారెవరు. అలాగే ఈ సృష్టిలో ఉన్న ప్రతి ప్రాణి మళ్ళీ నశించి పోతుంది. ఆ నాశనం చేసే విధానం ఏమిటి? పుట్టినటువంటి ప్రాణి ఎప్పుడూ అలాగే ఉండ లేదా? అని అనేక మైనటువంటి ప్రశ్నలు ఉదయిస్తాయి. ఈ ప్రశ్నలకు సమాధానమే ఆధ్యాత్మిక చింతన. వేదములు, శాస్త్రములు మనకు ప్రత్యక్షంగాని, ఊహించి తెలుసుకోలేని అనేక విషయాలను ఆవిష్కరిస్తాయి. ఈ సృష్టిని, ఈ సృష్టిలో ఉన్నప్రాణులను పుట్టిస్తున్న వాడు, నడిపిస్తున్న వాడు, నశింపజేసే వాడు భగవంతుడు అనేవాడు ఉన్నాడు. అని మనకు ప్రత్యక్షానుమానాల ద్వారా తెలియని నూతనమైన విషయాలను వేదం చెబుతుంది. ఆ వేదము చెప్పడం ద్వారా ఆ భగవంతుడికి సంబంధించిన వర్ణనలను తెలుసుకుని మనం విశ్వసిస్తున్నాము. భగవంతుడు అనే పదానికి ఒక వ్యుత్పత్తిని పురాణాలు చెప్తున్నాయి.



"ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసశ్శ్రియః।
జ్ఞానవైరాగ్యయోశ్చైవ షణ్ణాం భగ ఇతీరణాః"॥

సమగ్రమైన ఐశ్వర్యము అంటే నియమించే శక్తి. నియమించే శక్తి అనగా ఈ కార్యం ఇలా జరగాలి, ఈ వ్యక్తి ఇలా ఉండాలి, ప్రాణి ఇలా ఉండాలి. అని నియమబద్ధంగా లోకమంతా నడిచేట్లుగా చేసే ఒక శక్తికి ఐశ్వర్యము అని పేరు. సమగ్రమైన ఐశ్వర్యము అనగా కేవలం ఈ లోకమనే కాకుండా ఎన్ని లోకాలు ఉన్నాయని శాస్త్రాలు చెప్పాయో, అన్ని లోకాల్లోనూ, ఈ సృష్టి మొత్తంలో ఉన్నటువంటి వాళ్ళందరినీ కూడా నడిపించే శక్తి సమగ్రమైన ఐశ్వర్య శక్తి. అది కలిగి ఉండే గొప్ప శక్తి బలమే వీర్యము. యశసః అంటే కీర్తి. భగవంతుడు అని చెప్పగానే అందరూ తెలుసుకునేట్లుగా ఉండే ఒక గొప్ప కీర్తిని కలిగినవాడు. శ్రియః అంటే సంపద. భగవంతుడికి మించిన సంపద లోకంలో ఇంకా ఎవరికీ ఉండదు కదా! జ్ఞానం అంటే అన్ని జరిపించడానికి వీలుగా సమగ్రమైనటువంటి జ్ఞానం కలిగి ఉండుట. అనగా సర్వజ్ఞుడు భగవంతుడు. వైరాగ్యం అంటే ఇంతటినీ సృష్టిస్తున్నా వీటియందు వ్యామోహం లేకుండా, సృష్టించే పదార్థాల విషయంలో తాను లోబడకుండా ఉండే గొప్ప శక్తిని వైరాగ్యం అంటారు. ఈ ఆరు గుణములకు భగము అని పేరు. అది కలిగిన వాడు కనుక భగవాన్ అంటాము. అటువంటి ఆ భగవంతుడు సర్వ శక్తివంతుడు. మరియు సర్వజ్ఞుడు అన్నమాట.


ఆయన ఎలా ఉంటాడు అంటే భగవంతుడు లేని చోటులేదు. సర్వత్రా వ్యాపించి ఉంటాడు. కంటికి కనిపించే ప్రతి వస్తువూ భగవంతుడే. ప్రతిచోటా ఆయన వున్నాడు, సర్వత్ర నిండి ఉన్నాడు అని వేదములు శాస్త్రములు తెలిపాయి. దానిని భగవంతుడు మన అందరికీ తెలపడానికి ఒక రూపం ధరించి వచ్చిన గొప్ప అవతారమే నరసింహావతారం. భగవంతుడు తన శక్తిని తగ్గించుకొని రావడాన్ని అవతారం అంటారు. తనకుండే సమగ్రమైన శక్తిని కొంత తగ్గించుకొని తాను అందరికీ అందుబాటులో ఉండేటట్లుగా చూపించడాన్ని అవతారం అంటారు. అలా వచ్చిన మత్స్య, కూర్మ, వరాహ ఇత్యాది అనేక అవతారాలు ఉన్నాయి. వాటన్నిటిలో నరసింహ అవతారానికి వుండే వైశిష్ట్యం ఏమిటి అంటే? భగవంతుడు తాను సర్వవ్యాపకుడు అని ఉపనిషత్తుల్లో, వేదములలో చెప్పిన అర్థాన్ని నిరూపిస్తూ నరసింహ అవతారంలో దర్శింప చేస్తాడు. ఇదే నరసింహావతారానికుండే గొప్ప వైశిష్ట్యం.

హిరణ్యకశ్యపుడు గొప్ప తపస్వి. ఆయన ఎవరి వల్ల చావు లేకుండా గొప్ప వరాలు పొందాడు. తద్వారా ఆయన అజేయుడై ఉండి దేవతలందరినీ బాధిస్తూ ఉన్నాడు. హిరణ్యకశ్యపుని కుమారుడు ప్రహ్లాదుడు మహా భక్తుడు. విష్ణు భక్తిని కలుగజేసిన, గురువు అయిన నారదమహర్షి కంటే కూడా గొప్ప భక్తి గలిగినవాడు.

భాగవతోత్తములు అయిన భగవత్ భక్తులను స్మరించేటువంటి వరుసలో ముందుగా "ప్రహ్లాద నారద పరాశర పుండరీక వ్యాస అంబరీష శుక శౌనక భీష్మదాల్భ్యాన్। రుక్మాంగదార్జున వసిష్ఠ విభీషణాదీన్ పుణ్యానిమాన్ పరమభాగవతాన్ స్మరామి॥" అనే వరుసలో నారదున్ని కూడా రెండవ వానిగా చేసి గురువు కంటే కూడా గొప్ప భక్తి కలిగిన వానిగా (మిగతా 14 వ పేజీలో)

# శ్రీపతి స్తుతి

## సుభాషితం
### మంచి మాట



శ్రియై నమః! శ్రీధరాయ నమః!

**హర్యష్టకం**

**(గత సంచిక తరువాయి)**

ప్రాణ ప్రయాణ పాథేయం సంసార వ్యాధినాశనమ్।

దుఃఖాత్యంత పరిత్రాణం హరి రిత్యక్షర ద్వయమ్ ॥

ప్రతిపదార్థము: హరిః ఇతి= హరిః అనే, అక్షరద్వయం = రెండు అక్షరములు, ప్రాణ ప్రయాణ పాథేయం = ప్రాణములు శరీరమును విడిచి దీర్ఘయాత్రను చేయునప్పుడు దారి బత్యము. సంసార వ్యాధి నాశనం = సంసారం అనే రోగాన్ని నశింప జేయునది. దుఃఖాత్యంత పరిత్రాణం = దుఃఖమును లేశమైనను లేకుండా చేయునది.

తాత్పర్యము: హరి అనే రెండు అక్షరములు మనము ఈ శరీరాన్ని విడిచి పరలోకమునకు ప్రయాణమగునప్పుడు పాథేయమగును. పాథేయం అంటే మార్గంలో సుఖమున కలిగించు సద్ది. పూర్వంలో ఏదైనా వూరికి పోవాల్సివస్తే అన్నంలో పచ్చడి, కూర, చారు, నెయ్యి వగైరాలు కలిపి సద్ది మూట విస్తరాకులో గట్టుకొని వెళ్ళేవారు. ప్రయాణంలో అలసిపోయి ఆకలి వేస్తే ఏ చెరువు గట్టుపైననో వాగు ఒడ్డుననో విశ్రమించి అన్నం తిని ఆకలి తీర్చుకొని తిరిగి ప్రయాణం చేసేవారు. దానిని పాథేయం అంటారు. సుఖంగా ప్రయాణం చేయుటకు ఉపయోగంగా ఉండేది. సంసారం అంటే ఒక జన్మనుండి వేఱొక జన్మను ఆత్మ తీసుకొనుట. ఇది చాల కష్టము. పుట్టుట, పెరుగుట, ఇది ఒక వ్యాధి వంటిది. వ్యాధి లేకుంటే సుఖం గదా! ఎవరైతే హరి అని భగవంతుని మనసారా స్మరిస్తారో వారికి సంసారం ఉండదు. కష్టాలు మనకు ఎన్నో రకాలుగా వుంటవి. వాటిని తొలగించుకోవడం మననించి కాదు. అదే 'హరి' నామస్మరణ చేశామనుకోండి, అప్పుడు కొంచెంకూడా దుఃఖం లేకుండా నశించి పోతుంది.

బద్ధః పరికరస్తేన మోక్షాయ గమనం ప్రతి।

సకృ దుచ్చారితం యేన హరి రిత్యక్షర ద్వయమ్॥

ప్రతిపదార్థము: యేన= ఎవని చేత, హరిః ఇతి = హరి అని, అక్షరద్వయం = రెండు అక్షరములు, సకృత్ = ఒకసారి, ఉచ్చారితం = పలుకబడినదో, తేనా = అతని చేత, మోక్షాయ = మోక్షము కొఱకై, గమనం ప్రతి = పోవుటను గుఱించి, పరికరః = సాధన సామగ్రి అంతయు, బద్ధః = కట్టబడినది.

**శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనరసింహాచార్యులు**

తాత్పర్యము: హరిః అనే రెండక్షరములు భక్తితో మనస్ఫూర్తిగా ఒక్కసారి పలికిన చాలును. అతనికి మోక్షం కొరకై ప్రమాణమగునప్పుడు ఏయే సాధనాలు అవసరమో అవన్నియు సంపాదించినట్లగును.

ఇంతటితో హర్యష్టకము పూర్తియైనది. హరి అని పేరు గలగిన 8 శ్లోకములు అయిపోయినవి. మనం పరిశీలించినచో 9 శ్లోకాలు కనబడుచున్నవి. కాని 8 శ్లోకాలు అనడం ఎట్ల కుదురుతుంది ? అనే సందేహం కలుగుతుంది.

'హరిర్హరతి పాపాని' అనే మొదటి శ్లోకము అష్టకంలో చేరదు. అదెట్లకుదురుతుంది? హరి అనే పరమాత్మ పాపాలను హరించును అనే విష్ణువు యొక్క గొప్పదనమును తెలుపుతుంది. ఇక 'హర్యష్టకం' అని దీనికి పేరు ? అంటే 'హరి రిత్యక్షర ద్వయం' అనే శ్లోకం లోని 4వపాదము ప్రతి శ్లోకంలో కనబడుతుంది. అదే 2వ శ్లోకం సగంగా మొదలు 9వ శ్లోకం బద్ధః పరికరః అనే శ్లోకం వరకు 8 శ్లోకాలు అవుతవి. కాబట్టి అష్టకమనే పదము సార్థకమని మనం గుర్తించాలి. ఇక ఫలశృతి, ఈ స్తోత్రం ఎవరు రచించారు? అనే విషయం చివర రెండు శ్లోకాలలో వుంది.

హర్యష్టక మిదం పుణ్యం ప్రాతరుత్థాయ యః పఠేత్।

ఆయుష్యం బల మారోగ్యం యశో వృద్ధిశ్శ్రియా వహమ్॥

ప్రతిపదార్థము: ఇదం= ఈ, పుణ్యం - పుణ్యమైన, హర్యష్టకం = హరి అనే చివరి పాదంగల, అష్టకము= 8శ్లోకముల గుంపును, యః = ఎవడైతే, ప్రాతః = వేకువనే, ఉత్థాయ= లేచి, పఠేత్ = చదువునో, (అతనికి) ఆయుష్యం= చాలా కాలము జీవించు శక్తి, బలం = శరీరబలము, ఆరోగ్యం = రోగములు లేకుండుట, యశోవృద్ధిః = కీర్తి వృద్ధి పొందుట, శ్రియావహం = గొప్ప ఐశ్వమును పొందుట (సిద్ధించును). తాత్పర్యము : అతి పవిత్రమైన ఈ హర్యష్టకాన్ని (మిగతా 10 వ పేజీలో)

## శ్రీపతి స్తుతి | సుభాషితం

(9వ పేజీ తరువాయి) తెల్లవారుతుండగానే మేల్కొని పఠించవలెను. ఎందుకనగా 24గంటలుగల రోజులో తెల్లవారు సమయంలో మనలో సత్వగుణం అధికంగా వుంటుంది. తర్వాత సమయంలో రజోగుణ ప్రకోపము, ఆ పిదప రాత్రి తమోగుణా పాచుర్యం వుంటుంది. కాబట్టి భగవంతుని నామోచ్చారణము ప్రాతః కాలం లోపలనే చేయాలి అని ఈ శ్లోకం తెలుపుచున్నది. ఈ పఠనం ద్వారా మానవులకు అన్ని ఫలములు సిద్ధించును. ఏవేవో కొన్నింటిని తెలుపుచున్నది. మిక్కిలి ఆయుష్యం కలుగుతుంది. శరీరంలో బలము మనస్సుకు బలము, ఏరోగములు లేకండా ఆరోగ్యము, గొప్పకీర్తి వ్యాప్తి జెందుతుంది. ఐశ్వర్యం పెరిగి ధనాధి పతి యగును. ప్రహ్లాదేన కృతం స్తోత్రం దుఃఖ సాగరశోషణమ్ యః పఠేత్ స నరో యాతి తద్విష్ణోః పరమం పదమ్॥

ప్రతిపదార్ధము: ప్రహ్లాదేన = ప్రహ్లాదుని చేత, కృతం = చేయబడిన, దుఃఖ సాగర శోషణం = సముద్రం వలె అపారంగా ఉండే దుఃఖాన్ని, శోషణం = ఎండింప చేయ సమర్థమైన, స్తోత్రం = ఈ స్తోతమును, యః = ఏ, నరః = మానవుడు, పఠేత్ = చదువునో, సః = అతడు, తత్ = ఆ విధంగా ప్రసిద్ధమైన, విష్ణోః = విష్ణుమూర్తి యొక్క పరమం = ఉత్కృష్టమైన, పదం = స్థానమును గుఱించి, యాతి = వెళు చున్నాడు.

తాత్పర్యము: ప్రహ్లాదుని చేత రచింపబడిన ఈ స్తోత్రము సాగరం వలె అగాథమైన అంతులేని దైన దుఃఖమును తొలగింప చేయును. ఎవరు పఠించినను బ్రతికి యున్నంతకాలము ఈ లోకంలో ఆనందాన్ని పొందును. అంతే కాదు ఈ శరీరాన్ని విడిచిన తరువాత శ్రీమన్నారాయణుని దివ్య ధామమైన శ్రీవైకుంఠంలో చేరి భగవంతునికి ప్రీతికారితమైన కైంకర్యమును చేయుచుండును. పునర్జన్మ అతనికి వుండదు. (తదుపరి మాసము కృష్ణాష్టకము)

## మంచి రోజులివిగో...

మే నెలలో వివాహము, గృ.ఆ, గృ.ప్ర, ఉపనయనము శుభ ముహూర్తముల తేదీలు ఇవ్వడం జరిగినది, కొన్ని ద్వితీయ శ్రేణి ముహూర్తములు కూడా ఇందులో కలవు. పురోహితుల వద్ద చూపించుకొని నిర్ణయం చేసుకోవలసినది. 03-05-23 వివాహము, గృ.ఆ, గృ.ప్ర, ఉపనయనము, 04-05-23 వివాహము, 05-05-23 వివాహము, 07-05-23 వివాహము, 11-05-23 వివాహము, 12-05-23 వివాహము, 13-05-23 వివాహము, 14-05-23 వివాహము, 21-05-23 వివాహము, 24-05-23 వివాహము, 26-05-23 వివాహము, 31-05-23 వివాహము, గృ.ఆ, గృ.ప్ర, ఉపనయనము.


## ఆనందము మోక్షకందము

(6వ పేజీ తరువాయి) సాంప్రదాయ రక్షణలో నేత్రాలను పోగొట్టుకున్నారు శ్రీకూరేశులు. సమాజహితానికి, సాంప్రదాయ రక్షణకు కర్తవ్య నిష్ఠతో జీవించే జగదాచార్యులకు కూడా నేత్రహీనులైన శిష్యుని చూసి హృదయం ద్రవించింది. ఆచార్యులైన పెరియనంబిని కోల్పోయానని తెలిసి చింతించారు. శ్రీ కురేశుల దరికి చేరి, అనునయించి, "పేరరుళాల్" అని దయానిధిగా ప్రసిద్ధమైన కంచి పెరుమాళ్లను నేత్రాల కొరకై ప్రార్థించమన్నారు. ఆచార్య ఆజ్ఞతో కూరేశులు వరదరాజస్తవంతో ప్రార్థించారు. ఆచార్యులు పురమాయించగా పంచస్తవాలను కూడా రచించారు. వరదరాజస్వామి కృపతో భగవంతుని, ఆచార్యులను దర్శించగలిగే జ్ఞాన నేత్రాలను వారు పొందారు.

వరదరాజస్వామి ఏ వరాన్నైనా అనుగ్రహించుటకు సిద్ధంగా ఉన్నాడు. అయినా కూరేశులు చోళరాజును దుశ్చర్యలకు పురికొల్పిన మంత్రి నాలూరాన్లకు మోక్షాన్ని ప్రసాదించమని ప్రార్థించారు. కరుణించిన వరదరాజస్వామి సంబంధ సంబంధీకులందరికీ మోక్షాన్ని ప్రసాదించారట. ఆ విధంగా శ్రీసాంప్రదాయాన్ని అనుసరించే శ్రీరామానుజార్య సంబంధీకులు అందరికీ మోక్షమే! అట్లే ఆలయ గోపురమునెక్కి సర్వులకు మంత్రార్థాన్ని ఉపదేశించి మణి మంటప మార్గదాయిగా యతి రాజులు స్తుతించబడ్డారు. భూమిపై అవతరించక ముందే ఆదిశేషులుగా భగవంతునిచే ఆజ్ఞాపింపబడి ఉభయ విభూతి నాయకత్వం పొందారని కూడా పెద్దలు ప్రస్తుతిస్తారు. అనగా ఇహలోక ఆనందాన్ని, మోక్షాన్ని కూడా శ్రీరామానుజాచార్య సంబంధంతోనే పొందగలము అని సుస్పష్టము. 'శ్రీ రామానుజ మార్గమందు' మందు మరొక గొప్పవిశేషం ఉంది. భగవంతునికి చేతనులందరూ సమానమే. శరీర శరీరి సంబంధాన్ని వారు ప్రతి పాదించి నిరూపించారు. "పశుర్మనుష్యః పక్షీవా యేచ వైష్ణవ సంశ్రయాః! తేనైవ తే ప్రయాస్యంతి తద్విష్ణోః పరమం పదం!! అనేది శ్రీరామానుజ సంప్రదాయము. పశువయినా మానవుడయిన పక్షి అయినా ఏ జాతి వాడయినా విష్ణు సంబంధ ఆశ్రయాన్ని పొందితే విష్ణు పదమయిన పరమపదాన్ని మోక్షాన్ని పొందగలరు. అది ఆచార్య సమాశ్రయణ సంబంధము చేత భక్తిభావ శరణా గతితో మోక్షాన్ని పొంద గలరని పెద్దల మాట! అందుకే

*"ఆనందము... మోక్షకందము...*
*రామానుజార్య సంబంధమూ!..."*

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు




శ్రీమతి తిరుమల నీరజ

(క్రిందటి సంచిక తరువాయి)

ఇక ఆ తర్వాత పృథువు అవతారం, ఎనిమిదవది. వేనుడు అనే రాజు పుత్రుడు పృథువు. ఇతడు శ్రీమన్నారాయణుని అంశతో జన్మించిన వాడు. తన తండ్రిని పున్నామ నరకం నుంచి తప్పించిన వాడు, భూమిని గోవుగా చేసి ఓషధు లన్నిటినీ పిండిన వాడు.

ఆ పైన తొమ్మిదవ అవతారం ఋషభ అవతారం. ఆగ్నీధ్రుడు అనే రాజు పుత్రు డైన నాభికి, సుదేవికి శ్రీమహావిష్ణువు ఋషభుడుగా పుట్టాడు. జడుడుగా కనబడుతూ యోగసిద్ధి పొందాడు. నాత్య సమాధి స్థితిలో ఉండిపోయి, పరమహంసలు చేరుకున్న పదం పొందాడని మహామునుల చేత ప్రశంసలు పొందాడు.



తరువాతిది పదవ అవతార మైన హయగ్రీవ అవతారం. బ్రహ్మదేవుడు చేసిన యాగం నుండి విష్ణువు హయముఖుడుగా ఉద్భవించాడు. ఈతని ముక్కుపుటాల ఊపిరుల నుంచి వేదాలు జనించాయి.

ఇక పదకొండవ అవతారం మత్స్య అవతారం. ప్రళయ సమయంలో మునిగి పోయిన సమస్త ప్రపంచాన్నీ, ప్రాణికోటినీ ఆదుకున్నాడు స్వామి చేప రూపంలో. వేదా లన్నిటినీ మళ్లీ బ్రహ్మకు అందించాడు.

నారాయణుని పన్నెండవ అవతారం కూర్మ అవతారం. అంటే తాబేలు. క్షీరసాగర మథన వేళ, సముద్రంలో మునిగి పోతున్న మందర పర్వతం కిందికి మహా కూర్మంగా చేరి దాన్ని నిలబెట్టాడు.

పదమూడవది నృసింహ అవతారం. హిరణ్యకశిపుడు దేవలోకంలో కలవరం పుట్టించి దేవతలను బలహీనులను చేసిన తరిని, విష్ణువు నరసింహావతారం ధరించి ఆ రాక్షసుణ్ని వధించాడు.

పద్నాలుగవ అవతారం ఆది మూల అవతారం. ఒక గజరాజు ఒక మకరానికి చిక్కి బాధ పడ్డాడు. ఆ మొసలిని వదిలించుకోలేక, ఆ గజరాజు శ్రీహరిని శరణు వేడాడు. తన చక్రంతో మొసలిని నరికి, ఆ కరీంద్రాన్ని రక్షించాడు పరమాత్మ.

పదిహేనవది వామన అవతారం. ఇంద్రునికి స్వర్గలోకాన్ని తిరిగి ఇప్పించటం కోసం రాక్షస రాజైన బలిని మూడడుగుల నేల దాన మిమ్మని అడిగాడు స్వామి, వామన రూపంతో వెళ్లి. అతని ధైర్యానికి మెచ్చి రసాతలానికి ప్రభువును చేశాడు, ద్వార పాలకుడుగా సాక్షాత్తూ తానే నిలబడ్డాడు.

క్షీర సాగర మథన సమయం లోనే అమృతకలశాన్ని చేత పట్టుకుని ధన్వంతరిగా అవతరించాడు. రాక్షసులు ఆ అమృతకలశాన్ని అపహరించి తీసుకు పోతుంటే, మోహినిగా అవతరించి అమృతం రాక్షసులకు దక్కకుండా చేశాడు.

ఆ తర్వాత పద్దెనిమిదవ అవతారం పరశు రాముడుగా భృగువంశంలో అవతరించి, తన చేతి లోని గండ్ర గొడ్డలితో దుష్ట రాజులను మడియించాడు. భూమండల మంతటినీ బ్రాహ్మణులకు దానం చేసి, ధర్మ రక్షకుడు అనే ఖ్యాతిని పొందాడు.


పంతొమ్మిదవ అవతారం రఘువంశ సుధాంబుధి చంద్రుడైన శ్రీరామునిది. రావణాది రక్కసుల మద మణచి భూలోకానికి వారి బెడద లేకుండా చేయటమే కాకుండా, అన్నదమ్ముల అనుబంధానికీ, ఆదర్శ దాంపత్యానికీ చెప్పలేని గొప్ప ఉదాహరణగా నిలచాడు.

ఆ పైనఇరవయ్యవ అవతారంగా శ్రీకృష్ణుడుగా జన్మించాడు. రాక్షస వధతో పాటు తన తల్లిదండ్రుల బంధాలనూ తొలగించాడు.

ఇరవై ఒకటవ అవతారంగా శ్రీపతి పరాశర మహర్షికి ప్రియపుత్రుడైన వేదవ్యాసుడుగా అవతరించి లోకానికి పురాణాలు. ఉప పురాణాలు, మహాభారతం, శ్రీభాగవతం వంటి అత్యుత్తమ వాఙ్మయాన్ని అందించాడు. (సశేషం)



# పుష్ప యాగము



శ్రీమాన్ శ్రీ చించాపట్ల జగన్మోహనాచార్యులు

భగవత్ ఆరాధనా కైంకర్యమునందు నిర్వహించు ఉత్సవాలకు గొప్ప విశేషం ఉంది. వానిలో సమర్పింప బడు పుష్ప యాగానికి ఒక ప్రత్యేకత ఉంది.

'ఉత్సూతే హర్షమితి చ తస్మాదేష మహోత్సవః' అను శ్రీప్రశ్నసంహిత వాక్యమునననుసరించి హర్షమును పెంచేది ఉత్సవమని తెలుస్తున్నది. ఆలయములలో బ్రహ్మోత్సవము, అధ్యయనోత్సవము, పవిత్రోత్సవమను మూడు ఉత్సవములు తప్పనిసరిగా జరుపాలని పూర్వాచార్యుల శ్రీసూక్తి. బ్రహ్మోత్సవములు పెద్ద ఉత్సవములు. భక్తులకు గొప్పహర్షమును కలిగించటానికి ఉద్దేశించినవి. అధ్యయనోత్సవములు పరమాత్మకు హర్షమును కూర్చేవి. పవిత్రోత్సవములు ఆలయ పవిత్రతను కాపాడుతాయి. ఆగమశాస్త్రములలో కర్షణాది ప్రతిష్ఠాంతం, ప్రతిష్ఠాద్యుత్సవాంతం, ఉత్సవాది ప్రాయశ్చిత్తాంతమ్' అని ఆలయములలో జరుగు క్రియలు మూడుదశలుగా వివరింపబడ్డాయి. ప్రతి ఉత్సవము చివర ప్రాయశ్చిత్తము నిర్వహింపబడాలని శాస్త్రం చెబుతున్నది. చేయబడిన క్రియలోని తెలిసి తెలియక జరిగిన దోష పరిహారార్థము ప్రాయశ్చిత్తములు చెప్పబడినవి. కృత్యాకరణ అకృత్యకరణ క్రియలవలన కలిగిన దోషాలు పాపాలను కలుగజేస్తాయి. పాపము పా అప ఫలితమును కలుగకుండా ఆపి వేయునవి. దోష పరిహారార్థము చేయబడిన ప్రాయశ్చిత్తములు ఫలమును పొందుటలోని అడ్డంకులను తొలగించి ఉపకరిస్తాయి.

ఆక్రమంలోనే దోష పరిహారార్థముగా పుష్పయాగాలు నిర్వహింపబడుతున్నాయి. గోదాదేవి పుష్ప సమర్పణతో చేసే ఆరాధనను గురించి తెలియజేసింది. తిరుప్పావైలోని 'తూమలర్ తూవి వాయినల్ పాడి మనత్తినాల్ శిందిక్క పోయ పిళైయుమ్ పుగుదరువానిన్రనవుమ్ తీయినిల్ తూశాగుమ్' అనువాక్యమునననుసరించి పుష్పములను స్వామి నామములను పలుకుచు భక్తితో సమర్పిస్తే నిప్పులో పడిన దూదివలె దోషాలు నశిస్తాయని ఉపదేశించింది. ఆవిధంగా పుష్ప, మాలా కైంకర్యము. బహుళ ప్రచారమును పొందింది.

'అబద్ధేభ్యః ప్రసూనేభ్యో బద్ధమాలా ప్రశస్యతే',


'మాలాభ్యస్త్రగ్వరామాలా సజాతీయ ప్రసూనకా' అను పద్మ సంహిత వాక్యములననుసరించి విడి పుష్పములను సమర్పించుటకంటె చక్కగా కూర్చిన మాలికలుగా సమర్పించుట మంచిది. ఒకేజాతి పుష్పముల మాలికను సమర్పించుట మరీ మంచిదని తెలియుచున్నది. కాని 'పత్రం పుష్పం ఫలం తోయం' అనుచోట ప్రయోగించ బడిన ఏకవచన శబ్దముల వలన ఒక పుష్పమును సమర్పించుమనే (విడిపుష్పములు) అర్థము స్ఫురిస్తున్నది. అన్నివేళలా మాలా కైంకర్యమని చెప్పిన భగవానునివాక్యము బాధింపబడును. కావున స్వామి దివ్యమంగళ విగ్రహమును అలంకరించు కైంకర్య సందర్భములలో మాలాకైంకర్యమును, అర్చనాదులలో స్వామి పాదపద్మములపై సమర్పించు సందర్భములలో విడి పుష్పముల వికిరణమనియే చెప్పవలసిఉంది. "సమ్మార్జ్యాలిప్యచ హరేర్దామ పుష్పానిభూతలే వికిరేన్మనుజస్సర్వాన్ కామానాప్నోతి పుష్కలాన్' పుష్పవికిరణమను పదప్రయోగము ఆగమశాస్త్రములందును కనిపిస్తున్నది. "వినైవళ్ళిరుళెన్నుమ్ మునైకళ్ వెరువిప్పోమ్ శునై నన్మలరిట్టునినైమిన్ నెడియానే' (తిరువామొజి 10-5-10) నకు ఈడు వ్యాఖ్యానంలో "తిరుమన్త్రత్తైచ్చొల్లి అజికియ మలర్కళైక్కొణ్డు అవన్తిరువడి కళిలేపరిమారి అవనై స్నేహయుక్తమాక్కి వైయుజ్గోళెన్రుకొణ్డు ప్రస్తుతమాన భక్తియోగత్తై చ్చొల్లి ముడిక్కిరార్" అని చెప్పబడింది.

ఈ విధముగా తిరుమన్త్రమును పలుకుచు చక్కని పుష్పములను స్వామి పాదపద్మములపై సమర్పించి స్నేహపూర్వకముగా అనుసంధిస్తే ప్రతిబంధకములు వాటికవే తొలగిపోతాయి అని చెప్పబడింది, అలాగే "ప్రోక్తం స్వస్యచ కీర్తనం ప్రపదనం తస్మై ప్రసూనార్పణం". భగవంతుని నామ మంత్రములు పలుకుతూ పుష్ప సమర్పణ చేయవచ్చును.

భగవంతునికి భక్తితో చేసే హృదయ పుష్ప సమర్పణం కూడా ప్రధాన మైనదే! అర్చాస్వరూపుడైన భగవంతునికి పుష్పార్చనము, మాలా సమర్పణం శ్రేష్ఠమైనవి. ప్రత్యేక పర్వదినములందు, ఉత్సవాదులయందు దేవాలయాదులలో మరియు గృహాదులలో పుష్పార్చనము ఆచరణీయము. అందుకే కన్నుల పండుగగా ఆచరిస్తూ భగవంతుని ఆరాధిస్తూ "పుష్ప యాగ" కైంకర్యాన్ని సమర్పిస్తున్నాము.

★

# జ్యోతిర్విజ్ఞానమ్



## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక

శ్రీసన్నిధానం పాఠకులు మీ జ్యోతిష్య శాస్త్ర సందేహాలను ప్రశ్నగా మాకు పంపండి, పరిష్కారాలను పొందండి! ఈ విజ్ఞానామృతాన్ని మీరూ ఆస్వాదించండి!!


(గత సంచిక తరువాయి)

కాలేన ఫలితా వేదా మాస మేకం పురాణకమ్
సద్యస్ఫలతి గాంధర్వం జ్యోతిర్వైద్యం నిరంతరం

అనగా జ్యోతిష్య శాస్త్రము, వైద్యశాస్త్రము ఇవి రెండు కూడా మానవుని యొక్క నిజ జీవితంలో ప్రధానమైన స్థానాన్ని వహించి ఉన్నాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. జ్యోతిష్యశాస్త్రం మానసిక ఆలోచనలకు చక్కని పరిష్కారాన్ని చెప్పేది, అలాగే వైద్యశాస్త్రం శారీరకమైన రుగ్మతలకు సరియైన ఉపశమనాన్ని కలిగింప చేసేది అని మన పెద్దలు చెబుతుంటారు.

అట్లాగే జ్యోతిష్య శాస్త్రం లో ఉండే ఆరు భాగాలలో ఒక భాగమైనటువంటి వాస్తు శాస్త్రాన్ని గురించి మనం ప్రస్తావించుకుంటున్నాము. వాస్తు శాస్త్రంలో దశవిధ వాస్తుల విషయాన్ని గతంలో ప్రస్తావించుకోవడం జరిగింది. ఒకటి స్థల వాస్తు, రెండు స్థాన వాస్తు, మూడు వర్ణ వాస్తు, నాలుగు ప్రాకార వాస్తు, ఐదు ద్వార వాస్తు, ఆరు గణిత వాస్తు, ఏడు పథక వాస్తు, ఎనిమిది అలంకార వాస్తు తొమ్మిది మంత్రం వాస్తు, పది యోగ వాస్తు (వీటి సారము సిద్ధ వాస్తు). వీటి గురించి ముందు ముందు తెలుసుకుంటాం. స్థల వాస్తు గురించి గత సంచికలో కాస్త ప్రస్తావించడం జరిగింది. ప్రధానంగా స్థాన వాస్తు గురించి కొంచెం వివరంగా తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం! స్థానం అంటే ప్లేస్. అక్కడ భూమిలో ఉండే ఎనర్జీ, ఆ భూమి యొక్క విశేషం ఏమిటి? భూమికి ఎలాంటి బలాలు ఉంటాయి? ఏ బలము దేనికి ఉపయోగపడుతుంది? భూమిలో ఉన్న అద్భుతమైన దివ్యమైన ప్రభావం ద్వారా, శక్తి ద్వారా ఏ ఏ లాభాలు కలుగుతాయి? అనే విషయాన్ని స్థాన వాస్తులో ప్రస్తావించుకోవచ్చు. స్థానం అంటే మనకు యోగివేమన చెప్తాడో మాట "స్థాన బలమే కానీ తన బలము కాదయా విశ్వదాభిరామ వినురవేమ" అని. ఆ స్థాన, స్థల ప్రభావ విశేషాలను పరిశీలిస్తే పుణ్యక్షేత్రాలకు వర్తిస్తుంది. విద్యాలయాలకు, వైద్యాలయాలకు, న్యాయాలయాలకు వ్యవసాయ క్షేత్రాలకు వర్తిస్తుంది. కొన్ని స్థానాలలో చక్కని దేవాలయాల నిర్మాణం చేస్తారు. ఆ స్థానం చాల గొప్పదయితే అక్కడి ఆలయం దివ్యమైన ప్రకాశంతో మహిమాన్విత స్థలంగా జనంతో, ధనంతో, శాంతితో, ఆనందంతో తులతూగుతూ ఉంటుంది.

భగవంతుని యొక్క పాదం ఎంత గొప్పదైనా, పవిత్రమైనదైనా స్థల ప్రభావం తప్పకుండా వుంటుంది. భగవంతుడు పరమపదంలో, వ్యూహంలో, విభవంలో, అర్చామూర్తిగా, అంతర్యామిగా ఉన్నాడు. భగవంతుడు లేని చోటంటూ లేదు అని శాస్త్రాలు చెప్పినా చూచేటువంటి యోగ్యత మన నేత్రాలకు లేదు. అందువలన భగవంతుణ్ణి ఎక్కడ ప్రతిష్ఠించుకుంటే మనం చూసే భాగ్యం కలుగుతుంది. అనే విషయాన్ని పెద్దలు నిర్ణయించి ఆగమ శాస్త్రం ద్వారా ఆలయాలు నిర్మాణం చేయడాన్ని నిర్దేశించారు. ఏ స్థానంలో దివ్యత్వం ఉంటుంది అనే విషయం స్థల పరీక్ష ద్వారా పెద్దలు నిర్ణయిస్తారు. ఉదాహరణగా పరిశీలిస్తే ఎన్నోచోట్ల శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయాలు ప్రసిద్ధంగా పూజలందు కుంటున్నాయి. కానీ తిరుమల తిరుపతి క్షేత్రం స్థానం యొక్క ప్రభావం చాలా గొప్పది. "వెంకటాద్రి సమం స్థానం బ్రహ్మాణ్డే నాస్తి కించన వెంకటేశ సమోదేవో న భూతో న భవిష్యతి" ఎక్కడ కూడా కానీ వేంకటాద్రి సమ స్థానం లేదు, ఆ స్వామి తానుగా ఎన్నుకొని ఆ పర్వతం మీద స్థిరంగా కొన్ని యుగాల పాటు ఉండాలి అనుకున్నాడు కనక భగవత్ సంకల్పం చేత ఏర్పడిన ఆ స్థానానికి, స్థలానికి అద్భుతమైన ప్రభావం నేటికీ కనిపిస్తోంది, నాడు ఉంది, రేపు కూడా ఉంటుంది. అంటే ఆ స్థాన బలం ఎంతో గొప్పది. ఎన్ని దేవాలయాలు ఉన్నా వెంకటాద్రిలో ఉండే స్వామి ప్రభావం, అక్కడ ఉండే జనం, ధనం, వైభవం మరోచోట మనకు కనిపించడం లేదు. వాస్తు శాస్త్ర భాషలో విచారిస్తే అక్కడ ఉండే స్థలము నైసర్గికంగా నైఋతి చక్కగా ఉన్నతమైన స్థానంలో ఉంది. దాని కంటే తక్కువ ఆగ్నేయం, దాని కంటే తక్కువ వాయువ్య, తూర్పు, ఉత్తర, ఈశాన్యాలు తగ్గుతూ రావడం అది స్థల వాస్తు. (మిగతా 14 వ పేజీలో)



# జ్యోతిర్విజ్ఞానం

(13 వ పేజీ తరువాయి) ఆ స్థలంలో ఉండే స్థాన ప్రభావం దివ్యమైన ఓషధులు, దివ్యమైన వనస్పతులు, దివ్యమైన లోహ, రస, ధాతుభూయిష్టమైన అద్భుతమైన శిలలచేత కూడున్నటువంటి పర్వతం స్థానము. అందువలన ఈ స్థానము గొప్ప ప్రభావంతో విరాజిల్లుతూ ఉంది.

స్థానం బలాన్ని పరిశీలిస్తే కొన్నిచోట్ల ప్రవహించే నదుల నీళ్ళు తేలికగా ఉంటాయి, తీయగా ఉంటాయి. కొన్ని చోట్ల లభించే జలం మందంగా ఉంటుంది, చప్పగా ఉంటుంది. మరి కొన్ని చోట్ల లభించే జలం ఉప్పుగా ఉంటుంది, వొగరుగా ఉంటుంది, వెగటుగా ఉంటుంది కారణం స్థాన ప్రభావమే. ఉదాహరణగా హరిద్వార్ ప్రాంతాన్ని పరిశీలిద్దాము. అక్కడ ఉండే గంగా జలాన్ని స్నానం చేసినా, సేవించినా, పానం చేసినా అద్భుతమైన ఆరోగ్యమే లభిస్తుంది. ఆ గంగా జలాన్ని నిలువ చేస్తే కొన్ని సంవత్సరాల వరకు కూడా జలం చెడిపోకుండా స్వచ్ఛంగా చాలా రుచిగా, తాజాగా ఉంటుంది. అట్లాగే ఆ గంగ జలం ఎన్నో ప్రాంతాల్లో తిరిగింది. ప్రాంతాలను బట్టి పేర్లు కూడా మారిపోయాయి. గంగా, నర్మదా, తుంగభద్రా, మూలాపహరి, కృష్ణవేణి, తామ్రపర్ణి, తపియోష్ణి, వక్రగా, పూర్ణిమ, విశాలాక్షి, వేత్రవతి, వేగవతి, కౌశికీ, గండకీ గోమలవతి, గోదావరి ఇలాగే ఎన్నో పేర్లు ఆ ప్రాంతాన్ని బట్టి అదే జలానికి వచ్చాయి. కానీ గంగా జలాన్ని నిలువచేస్తే ఉన్నంతకాలం మిగతా నదుల జలాలు వుండే అవకాశం లేదు కారణం? నీటిలో దోషమా? కాదు. స్థల స్థానముల ప్రభావమే కాని జలానిది కాదు. కొన్నిచోట్ల ఓషధి పర్వతాలు వున్నాయి. సంజీవకర్ణి, సంధామకర్ణి, విశల్యకర్ణి, సంయోగకర్ణి అని అద్భుతమైన బ్రహ్మౌషధులు పుట్టే స్థలాలు వున్నాయి. అవి అన్ని చోట్ల పుట్టవు. ఆయా స్థాన ప్రభావం చేత దివ్యమైన ఓషధులు మొలిచే అవకాశం, వాటి ప్రభావం చేత వాతావరణం అంతా అద్భుతమైన, ఆరోగ్యకరమైన స్థితిని సమస్త ప్రాణికి కలిగింప చేసేటటువంటి శక్తి ఉంటుంది.

పంటల గురించి విచారిస్తే ధాన్యాల పంటల్లో ఓ ప్రాంతంలో గోధుమలు, ఓ ప్రాంతంలో వరి, మరోప్రాంతంలో చిల్లర ధాన్యాలు పండుతాయి. కొన్ని ప్రాంతాలలో కొన్ని రకాల ఫలాలు పండుతూ ఉంటాయి. మరి కొన్ని ప్రాంతాల్లో వేరే రకాల ఫలాలు పండుతూ ఉంటాయి. అంటే అక్కడి వాతావరణానికి అనుకూలంగా స్థల సిద్ది కలిగి పంటలుకాని ఫలాలుకాని పండుతాయి. (మరికొన్ని రహస్యాలు వచ్చే సంచికలో...)

# "అత్యద్భుతరూపముద్వహన్"

(8 వ పేజీ తరువాయి) లోకంలో కీర్తింపబడే మహనీయుడు ప్రహ్లాదుడు. ఆ ప్రహ్లాదుడు తన తండ్రి హిరణ్యకశ్యపుడు అనేక రకాలుగా హింసిస్తూ ఉంటే, ఆ హింసలకు బాధపడకుండా నిరంతరం భగవంతుణ్ణే స్మరిస్తూ ఉన్నాడు. అప్పుడు హిరణ్యకశ్యపుడు "ప్రహ్లాదా! నువ్వు ఇంత గొప్ప శక్తిని చూపిస్తున్నావ్ కదా! ఏం చేసినా నీకు ఏం కావడం లేదు. ఇలా నిన్ను కాపాడుతున్న వాడు ఎవడు? ఆ భగవంతుడు ఎక్కడున్నాడు చూపించు" అని అడిగాడు. దానికి ప్రహ్లాదుడు "ఓ తండ్రీ! భగవంతుడు లేనిచోటు ఎక్కడ వున్నది. "ఇందు గలడు అందు లేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుండు ఎందెందు వెదకి చూచిన అందందే కలడు దానవాగ్రణి వింటే" అంటూ... "కలడంబోధి, కలండు గాలి, గలడాకాశంబునం, గుంభినిం గలడగ్నిన్, దిశలం బగళ్ళ నిశలన్"అని అంతా వ్యాపించి ఉన్నాడు భగవంతుడు అంటూ నిరూపించాడు. హిరణ్యకశిపుడు స్తంభాన్ని చూపించి, ఈ స్తంభం లో ఉన్నాడా అని ఆ స్తంభాన్ని కొట్టగానే దాంట్లో నుంచి నరసింహావతారం బయటికి వచ్చింది. సర్వత్రా వ్యాపించి ఉండేది భగవత్‌తత్వం అని చెప్పేవిధంగా వున్న గొప్ప అవతారం నరసింహావతారం. అంతేకాదు భక్తుణ్ణి రక్షించటానికి భగవంతుడు ఎలాగైనా సరే దిగరావచ్చు! ఏ రూపంలోనైనా రావచ్చు! పైగా ఈ రూపం కూడా చాలా అద్భుతమైనటువంటిది. సర్వత్రా భగవంతుడు వ్యాపించి ఉన్నాడు అన్న ప్రహ్లాదుడి యొక్క మాట నిజం చేయడానికి ఆవిర్భవించిన గొప్ప అవతారం. భక్తుల్ని భగవంతుడు కంటికి రెప్పలా రక్షిస్తాడు అనే భగవత్ తత్వాన్ని చెప్పడం, భగవంతుడు సర్వవ్యాపకుడు అనే తత్వాన్ని చెప్పడం కోసం ఏర్పడిన ఒక అత్యద్భుతమైన అవతారం నరసింహావతారం. ఈ అవతారం గొప్పతనం ఏమిటంటే నరావతారం. "ఆకంఠ మాదిపురుషం కంఠీరవముపరి కుంఠితారాతిం" అని వేదాంత దేశికులు అంటారు. కంఠం నుండి కింద ఉండే భాగమంతా మనిషి యొక్క రూపము. ఆ ఉన్న ముఖం మాత్రం సింహ రూపము ఉండే ఒక గొప్ప అత్యద్భుతమైన అవతారం. "అత్యద్భుతరూపముద్వహన్ స్తంభే సభాయాం న మృగం న మానుషం" అని భాగవతంలో వేదవ్యాస భగవానుడు అంటారు. "వైశాఖశుక్ల భూతోత్థాయనమః" అని అందరూ నరసింహస్వామిని కీర్తిస్తారు. వైశాఖ శుద్ధ చతుర్దశి నాడు సాయంకాల సమయంలో నరసింహస్వామి యొక్క ఆవిర్భావం జరిగిందన్నమాట! అటువంటి గొప్ప ఆవిర్భావం జరిగిన "నరసింహ జయంతి" ఇప్పుడు మే నెల నాలుగో తేదీన జరగనున్నది. ఆ అవతారమూర్తి అయిన నరసింహస్వామిని మనమంతా ప్రార్థించి సకలములైన శుభములను పొందాలని ప్రార్థిస్తున్నాము...

# శూర్పణఖ తత్త్వము



**శ్రీమాన్ శ్రీ శిరిశినహళ్ వెంకటాచార్యులు**

వైదిక ధర్మం, పురాణేతిహాసాల సారం, ఆళ్వారాచార్యుల సూక్త్యామృతం వేరుకాదు! మానవ ధర్మం,ఉజ్జీవనం ప్రబోధించే శ్రీ రామాయణంలోని ప్రముఖ సన్నివేశాలను, ఆధ్యాత్మిక భావమాధురిని తెలంగాణ భాషా సౌష్ఠవంతో రంగరించి ఆధునికంగా అందించిన అద్భుత రచన! ప్రముఖ ఉభయ వేదాంత పండితులు, ప్రవచన కారులు, గోపాలోపాయన పురస్కారగ్రహీత శ్రీమాన్ శ్రీ శిరిశినహళ్ వెంకటాచార్యులు సుమారు ఇరవై సంవత్సరాలకు పూర్వం రచించిన వ్యాసం.

పంచవటిలో పర్ణశాల. చుట్టూ అడవి, మధ్యలో గోదావరి, పూలు, నీళ్ళు. చల్లగా హాయిగా వుంది సీతమ్మకి. తనతో రాముడు తనముందు లక్ష్మణుడు. ఇంకేం తక్కువ? అంతరంగంలో పరమాత్మ బహిరంగంలో ఆచార్యుడు ఇద్దరి నీడలో జ్ఞాన జ్యోతి లావుంది సీతమ్మ. ఏదో రాక్షసి దాపురించింది. సీతమ్మ సంసారంలో చిచ్చు పెట్టి కన్నీళ్ళ కథకు నాంది పలికింది అహంకారానికి తోబుట్టువు రావణుని చెల్లెలు శూర్పణఖ.

రామున్ని చూచినా రాముడికి బదులు కాముడు కనిపించాడు. కళ్ళుకప్పి ఒళ్ళు మరచింది. దబ్బు రాయిలాంటి ఒళ్ళు, బండి చక్రాల్లాంటి కళ్ళు, విచ్చుకత్తుల్లాంటి పళ్ళు, ఏం మొహం. దానిది! అయినా తనకన్న అందకత్తెనే లేదనుకుంది. కాని సూర్యునిలో చీకటి ఇముడుతుందా? వెన్నెల్లో విషం పండుతుందా? ముద్దగట్టిన అజ్ఞానానికి ముక్తానందం లభిస్తుందా? ఈసంగతి మరచిన రాక్షసి రామున్ని చేరింది. అడవిలో దొరికిన హాస్యానికి రాముడు నవ్వాడు. దాన్ని ఆట పట్టించాలని అమాయకత్వం నటించాడు. లక్ష్మణున్ని అడగమన్నాడు. ఆచార్యుడిని ఆశ్రయిస్తే దాని ప్రకృతిలో మార్పు వస్తుందనుకున్నాడేమో? ఇంకేం? అది లక్ష్మణున్ని చేరింది. తానూ కాదని తిరిగి రామున్నే చూపించాడు. భగవంతుని సంకల్పం లేకపోతే ఆచార్యుని అనుగ్రహం కూడా కలుగదు. పరిశుద్ధంగా లేని మనస్సును పరమాత్మ అంగీకరించడు. శూర్పణఖ గతి రెంటికి చెడ్డ రేవడైంది. ఇటూ అటూ ఆశతో తిరిగింది. పచ్చగడ్డికోసం పరువెత్తే పశువులా శ్రుతి మించి రాగాన పడిన శూర్పణఖ, సీతమ్మవైపు కసిగా చూచింది. రామునికి తనకూ మధ్య ఆమెనే అడ్డుపుల్ల అనుకుంది. ఆమెను మింగేస్తే రాముడు తన వాడవుతాడనుకుని మీదపడి మింగవోయింది. శ్రీరామునికి కోపం వచ్చింది. హుంకరించి హడలగొట్టాడు. అపరాధం తనకు జరిగితే భగవంతుడు సహిస్తాడు. కాని తన భక్తులకు అపచారం జరిగితే భరించలేడు. శిక్షించి తీరుతాడు. అందుకే లక్ష్మణున్ని ఆజ్ఞాపించాడు. దానికి తగిన శాస్త్రి చేయమని, లక్ష్మణుడు దాని చెవులు కోసి చేతికిచ్చాడు. ముక్కు కోసి ముళ్ళె కట్టిచ్చాడు. 'అమ్మ'ను కాదని 'స్వామి'ని చేరితే అందరి పని అంతే! దేవుడిని పూజించి పూజని అవమానిస్తే దేవుడు సంతోషిస్తాడా? భగవంతుని అండ ఉంటే ఏ గండమూ వుండదు. ఈ సంగతి శూర్పణఖకు తెలియదు. దానిది తమోగుణ స్వభావం. కోరిక నెరవేరలేదు. క్రోధం పై కుబికింది. మంచిచెడులు మరచింది. బుద్ధి గడ్డి తిన్నది. పగ పడగలు విప్పింది. జనపథంలోకి పరుగెత్తి అన్నదమ్ముల్ని పురికొల్పింది. మండిపడి వచ్చి పడ్డారు ఖరదూషణాదులు. రామునిపై దూకబోయారు. ఒక్కడా ఇద్దరా పదునాల్గువేల మంది! ఒక్కడే రాముడు అందరినీ కుప్ప కూల్చాడు.

సీతమ్మనేమో పక్కగుహలో వుంది. లక్ష్మణుడు కాపలా కాస్తున్నాడు. దేవుడు కనిపించేదాక జీవున్ని రక్షించేది గురువే మరి! ఆ గురువునే కాదన్న వానికి దేవుడు కూడ దూరమౌతాడు. సీతమ్మ పని అంతే అయింది. అయోధ్యలో పన్నెండేళ్లు వున్నది. అడవిలో పదమూడేళ్ళు గడిపింది. ఎన్నడూ రామున్ని మరువలేదు. లక్ష్మణున్ని ఒక్కమాట అనలేదు. రాముడే తన సర్వస్వం రామునితోనే తన స్వర్గం అనుకునేది సీత. అమ్మకు అదేం ఖర్మమోగాని లేడిమీద మనసువోయింది ఆనాడు. నీలి నీలి కొమ్ములు, నల్ల కలువ చెవ్వులు, నల్ల తెల్ల ముఖము, బెదురు బెదురు చూపులు, రంగు రంగుల మిలమిల మెరిసే ఒళ్ళు అడవంతా జిగేల్ మనిపిస్తుంది జింక. అపురూప మృగం అది. ప్రాణంతో దొరికితే బంగారంలా పెంచుకోవచ్చు. చచ్చిపడితే చాపలా మలచుకోవచ్చు. ఆశపడింది సీతమ్మ.

**(తర్వాతి భాగాన్ని ఆస్వాదిద్దాం...)**



## శ్రీ వేణుగోపాల స్వామి వారి బ్రహ్మోత్సవాలు

జిల్లా కేంద్రమయిన జగిత్యాల పట్టణమున శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయములో వైశాఖ శు॥ ఏకాదశి సోమవారం మే 1 నుండి వైశాఖ బ॥పాద్యమి శనివారం మే6 వరకు "శ్రీవారి బ్రహ్మోత్సవములు" వైభవముగా నిర్వహించడానికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. తరలి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు.




## ఆచార్య కృప

శ్రీరామానుజ జయంతి సందర్భముగా ముచ్చింతల్ లో భగవత్ గీత అవధానం చేసిన విద్యార్థులను మరియు కరీంనగర్ కోఆర్డినేటర్ శ్రీమతి శ్రీదేవి గారికి స్వామి వారు మంగళాశాసనాలు అనుగ్రహిస్తున్న దృశ్యం

## తిరునక్షత్రోత్సవమ్

సత్సంప్రదాయ పరిరక్షణ సభ ట్రస్టు ఆధ్వర్యములో మహామహోపాధ్యాయ, కవిశాబ్దిక కేసరి, ఉభయవేదాంత మహోదధి, పరమపదవాసులు ఉ.వే. శ్రీమాన్ డా॥ శ్రీ.న.చ. రఘునాథాచార్యస్వామి వారి 98వ తిరునక్షత్రోత్సవమ్ 2023 మే 9 మంగళవారం ఉ. 9-00 గంటల నుండి మరియు సా. 6-00 గంటల నుండి కోడం కన్వెన్షన్ హాల్ రోడ్, వరంగల్ హంటర్, వేదికగా జరగ నున్నాయి.



## మే 1 నుండి శ్రీ హేమాచల స్వామి వారి బ్రహ్మోత్సవాలు



శ్రీహేమాచల నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు మే 1 నుండి ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్తల మండలి ఒక ప్రకటనలో తెలిపింది. మే 1 సోమవారం విష్వక్సేన పూజ, పుణ్యావచనం, అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మే 10న వసంతోత్సవం, మ॥ 12-00గం॥లకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, అనంతరం అన్నప్రసాద వితరణతో కార్యక్రమాలు ముగుస్తాయి.




జగిత్యాల జిల్లా ఇబ్రాహింపట్నం మం॥ గోధూరు గ్రామములో శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో చైత్ర శు॥ ఏకాదశి 01-04-23 నుండి బ్రహ్మోత్సవములు వైభవంగా జరిగాయి. ఇందులో చైర్మన్ ఒడ్డం శ్రీనివాస్, సోమ ప్రభాకర్, సర్పంచ్, బూరం సంజీవ్, ఆంసంఘం ప్రెసిడెంట్, మరియు సభ్యులు, అర్చకులు, గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో శ్రీరామానుజ జయంతి



ధర్మపురి దేవస్థానమందు శ్రీరామానుజ జయంతి ఉత్సవంలో శ్రీమాన్ శ్రీ కలకుంట్ల వరప్రసాదాచార్యులు పాల్గొన్నారు. శ్రీరామానుజాచార్యుల గురించి ప్రవచించారు, ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు, నంబి శ్రీనివాసాచార్యులు , నంబి నరసింహ మూర్తి, వరుణ్ స్వామి మరియు భక్తులు పాల్గొన్నారు.

## మన భూమి- మన బాధ్యత







కరీంనగర్‌లో వికాస తరంగిణి మరియు వేదపాఠశాల విద్యార్థులు ప్రపంచ ధరిత్రీ దినోత్సవ సందర్భంగా గత నెల 22న సాయంత్రం 5గంటలకు మన భూమి మన బాధ్యత అవగాహన యాత్రను స్థానిక కామధేను వేంకటేశ్వర ఆలయం నుండి చేపట్టినప్పటి దృశ్యం.